సాక్షి సంగారెడ్డి

బుధవారం । 5 । ఏప్రిల్ । 2023




నిందితులను కఠినంగా శిక్షించాలి
దొంగతనం చేశాడనే నెపంతో దళితుడైన మల్లేశంను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. 8లో



పంటను కాపాడుకునేందుకు పాట్లు
అడవి జంతువుల నుంచి పంటను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. మొక్కజొన్న పంట చుట్టూ చీరలు కట్టి పందుల నుంచి రక్షించుకుంటున్నారు. 8లో



సిద్ధేశ్వర జాతరకు సర్వం సిద్ధం
పురాతన దేవాలయాల్లో ఒకటైన పొట్టిపల్లి సిద్ధేశ్వర ఆలయం ఉత్సవాలకు ముస్తాబైంది. జాతరకు తరలిరానున్న భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. 9లో



న్యూస్‌రీల్

మంత్రి పర్యటనకు ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట పట్టణంలో ఈనెల 6వ తేదీన వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించనున్న ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పర్యటన ఏర్పాట్లను అదనపు కలెక్టర్ వీరారెడ్డి మంగళవారం సాయంత్రం పరిశీలించారు. మంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని మున్సిపల్ కమిషనర్ కష్టారెడ్డి, తహసీల్దార్ మనోహర్ చక్రవర్తులకు సూచించారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ చింత గోపాల్, తదితరులున్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

బొల్లారం మున్సిపల్ చైర్ పర్సన్ రోజారాణి



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

జిన్నారం(పటాన్‌చెరు): ఆరోగ్యంపై ప్రతీ ఒక్కరు శ్రద్ధ వహించటంతో పాటు సీపీఆర్‌పై అవగాహన ఉండాలని బొల్లారం మున్సిపల్ చైర్ పర్సన్ రోజారాణి అన్నారు. జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆస్పత్రి వైద్యురాలు రాధిక ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా గుండెపోటు వచ్చిన సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రోజారాణి మాట్లాడుతూ గుండె సంబంధిత వ్యాధులు ఉన్న వారు అప్రమత్తంగా ఉండాలన్నారు. సీపీఆర్‌పై అవగాహన కల్గి ఉంటే గుండెపోటు మరణాలను తగ్గించవచ్చన్నారు. ఆరోగ్యంపై ప్రజలు శ్రద్ధ పెట్టాలని, ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చినా తక్షణమే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రాజేంద్రకుమార్, వైస్ చైర్మన్ అనిల్ కుమార్‌రెడ్డి, కౌన్సిలర్‌లు, నాయకులున్నారు.

మాతా శిశు కేంద్రంలో కేంద్ర బృందం తనిఖీ

సంగారెడ్డి మున్సిపాలిటీ: ప్రభుత్వం చేపట్టిన లక్ష్య కార్యక్రమంలో భాగంగా రెండో రోజు మంగళవారం జిల్లా కేంద్రం సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రిలో కేంద్ర బృందం సభ్యులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మాతా శిశు కేంద్రంలో తిరిగి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అప్పుడే జన్మించిన శిశువుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారని స్త్రీ వైద్య నిపుణులు గాయత్రిని అడిగి తెలుసుకున్నారు. తల్లులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అలాగే ఆస్పత్రిలో జరుగుతున్న వ్యవహారాలపై రికార్డులను పరిశీలించి, అక్కడ పని చేసే సిబ్బందితో వివరాలు సేకరించి నమోదు చేసుకున్నట్లు తనిఖీ బృందం సభ్యులు నీతు శర్మ, అరుల్మహజీలు తెలిపారు. వారి వెంట జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్, ఆర్ఎంఓలు రవికుమార్, హెచ్ఓడీ షబ్బీర్, డాక్టర్స్ గాయత్రి, అశోక్, తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న 'పది' పరీక్షలు



కొండాపూర్(సంగారెడ్డి): జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ద్వితీయ భాష పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 21,383 మంది విద్యార్థులకు గానూ 21,345 మంది హాజరు కాగా 38 మంది గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ రాధారెడ్డి, ఇన్‌చార్జి డీఈఓ పటాన్‌చెరు, తెల్లాపూర్‌లలో పది కేంద్రాలను సందర్శించగా, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం సభ్యులు 33 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ పరీక్షకు 99.82 శాతం హాజరు నమోదైంది.

వేసవిని తట్టుకునేలా..

- మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు
- నర్సరీలపై షేడ్ నెట్‌ల ఏర్పాటు



పటాన్‌చెరు మండలం ముత్తంగి నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు



అందోల్ మండలం డాకూరు నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

సంగారెడ్డి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు అన్నిరకాల చర్యలు చేపట్టారు. వచ్చే హరితహారం నాటికి నాటేందుకు వీలుగా మొక్కలను సిద్ధం చేస్తున్నారు. జూన్ నెలలో ప్రారంభం కానున్న హరితహారం కార్యక్రమానికి కావాల్సిన మొక్కలను నర్సరీల్లో పెంచుతున్నారు. వేసవిలో ఎండల నుంచి మొక్కలను సంరక్షించేందుకు నర్సరీలపై షేడ్ నెట్‌లను ఏర్పాటు చేశారు.

- జిల్లాలో మొత్తం 647 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతి గ్రామంలోనూ ఉపాధి హామీ, అటవీ శాఖల ఆధ్వర్యంలో నర్సరీలు ఏర్పాటు చేశారు.
- ఒక్కో పంచాయతీలోని నర్సరీలో 7,000 మొక్కల వరకు పెంచుతున్నారు. ఈజీఎస్ ఆధ్వర్యంలో 639 గ్రామాల్లో, అటవీ శాఖ ఆధ్వర్యంలో ఎనిమిది గ్రామాల్లో నర్సరీలు ఉన్నాయి.
- వేసవి దృష్ట్యా మొక్కలు వాడిపోకుండా, ఎదుగుదల మందగించకుండా నీళ్లు పట్టేందుకు ఉపాధి హామీ పథకం కింద వన సేవకులను నియమించారు. పంచాయతీల్లో ఏర్పాటుచేసిన మొక్కల బాధ్యతను సర్పంచ్, కార్యదర్శులు, ప్రజా ప్రతినిధు బాధ్యత అప్పగించారు.

మొక్కల సంరక్షణకు చర్యలు

- ఎనిమిదో హరితహారం కార్యక్రమంలో భాగంగా వచ్చే హరితహారం కార్యక్రమం నాటికి నాటేందుకు మొక్కలను సిద్ధం చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు సంరక్షణ చర్యలు చేపట్టారు. సారవంతమైన మట్టిని తెచ్చి పాలిథిన్ కవర్లలో నింపి మొక్కలు పెంచుతున్నారు.
- రోజురోజుకూ ఎండలు మండుతున్నాయి. ఏప్రిల్, మే నెలల్లో ఎండ తీవ్రతకు తట్టుకునేందుకు నర్సరీపై గ్రీన్ షేడ్ నెట్లు ఏర్పాటు చేస్తున్నారు.
- సంగారెడ్డి, నారాయణఖేడ్, జహీరాబాద్ నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో ఆరు లక్షల వరకు మొక్కలు పెంచుతున్నారు.
- గ్రామంలో ప్రతి ఇంటికీ ఆరు మొక్కల చొప్పున పూలు, పండ్లు, నీడనిచ్చే అటవీ జాతి మొక్కలను అందించే విధంగా అన్ని రకాల మొక్కలను పెంచుతున్నారు.
- 2023 సంవత్సరానికి గాను మొత్తం 44 లక్షల 73 వేల మొక్కలు సిద్ధం చేస్తున్నారు. ఇందులో ఎక్కువగా మామిడి, జామ, బత్తాయి వంటి రకాలు ఉన్నాయి.

మొక్కలు సిద్ధం చేస్తున్నాం



వచ్చే హరితహారం కార్యక్రమం నాటికి మొక్కలను సిద్ధం చేసేలా అన్ని చర్యలు చేపడుతున్నాం. వేసవిలో ఎండలకు వాడిపోకుండా నర్సరీలపై షేడ్ నెట్‌లను ఏర్పాటు చేయిస్తున్నాం. లక్ష్యానికి అనుగుణంగా మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. ఎనిమిదో విడత హరితహారానికి 44 లక్షల 73 వేల వరకు మొక్కలను సిద్ధం చేస్తున్నాం.

– శ్రీనివాసరావు, డీఆర్డీఏ, సంగారెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శరత్, పక్కన ఎస్పీ రమణకుమార్, తదితరులు

కట్టుదిట్టంగా పరీక్షల నిర్వహణ

కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: జిల్లాలో పదో తరగతి పరీక్షలను కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ డాక్టర్ శరత్ తెలిపారు. అన్నివేళలా అప్రమత్తమై, జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయి పర్యవేక్షణలో పరీక్షలు సాఫీగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. మంగళవారం పదో తరగతి పరీక్షల నిర్వహణపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, డైరెక్టర్ దేవసేనలతో కలిసి కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని అందరూ బాధ్యతగా పని చేయాలన్నారు. పిల్లలను, తల్లిదండ్రులను గందరగోళ పరిస్థితులకు గురి చేయడానికి ఎవరు ప్రయత్నించినా ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయా శాఖల అధికారులు సమన్వయతో పని చేసి పరీక్షలు సాఫీగా జరిగేలా చూడాలన్నారు. తహసీల్దార్లకు, ఎంపీడీఓలకు ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేస్తూ, నిరంతర పర్యవేక్షణలో పరీక్షలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షల విధులకు హాజరయ్యే ఏ శాఖ అధికారులైనా, నిర్లక్ష్యంతో ఎలాంటి తప్పిదాలు చేసినా సస్పెండ్ చేయడమే కాకుండా, సర్వీస్ నుంచి తొలగించేందుకు ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్లకు సూచించారు. పరీక్షల సమయంలో 144 సెక్షన్‌ను పకడ్బందీగా అమలు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఎవరిని సెల్ ఫోన్‌తో పరీక్ష కేంద్రంలోకి అనుమతించవద్దన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి ఎస్పీ రమణకుమార్, డీఈఓ విజయ, డీఎస్పీ పాల్గొన్నారు.

ప్రగతిపథంలో పల్లెలు

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



రుద్రారంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

పటాన్‌చెరు: సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రతి పల్లెను ప్రగతి పథంలో ముందుకు తీసుకొని వెళ్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని ముత్తంగి, ఇస్నాపూర్ చిట్కుల్, రుద్రారం, లక్డారం, ఘనాపూర్, పాటి, కర్ధనూర్, నందిగామ గ్రామాల్లో రూ.5 కోట్ల 8 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, సీసీ రోడ్లను స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. అనంతరం నూతన రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దేశంలోనే మొట్ట మొదటిసారిగా ప్రవేశపెట్టిన పల్లె ప్రగతి పథకం గ్రామాల రూపురేఖలను మార్చిందని తెలిపారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, అంతర్గత డ్రైనేజీలు, వీధి దీపాలు, నర్సరీలు, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు, ట్రాక్టర్లు అందించినట్లు చెప్పారు. పరిశుభ్రత, పచ్చదనానికి పెద్ద పీట వేస్తూ పెద్ద ఎత్తున మొక్కల పెంపకం చేపడుతున్నట్లు తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ రక్షిత మంచినీటిని అందిస్తున్నామని, 24 గంటల పాటు నాణ్యమైన కరెంటును అందిస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ సుష్మ శ్రీ, జెడ్పీటీసీ సుప్రజ, వైస్ ఎంపీపీ స్వప్న, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్‌గౌడ్, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాండు, ఎంపీడీఓ బన్సీలాల్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు నీలం మధు ముదిరాజ్, ఉపేందర్, బాలమణి శ్రీశైలం, సుధీర్ రెడ్డి, సువర్ణ మాణిక్ రెడ్డి, కావ్య కాశి రెడ్డి, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

రాష్ట్ర జేఏసీ చైర్మన్ సాయిబాబా



నినాదాలు చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

సంగారెడ్డి మున్సిపాలిటీ: విద్యుత్ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ సాయిబాబా డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రం సంగారెడ్డిలో ఉమ్మడి మెదక్ జిల్లా విద్యుత్ ఉద్యోగుల సమస్యల సాధనకు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నారు. 2022 వేతన సవరణ, ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్ వరకు, ఆర్టిజన్ కార్మికుల కన్వర్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తున్న క్రమంలో విద్యుత్ ఉద్యోగులు ఎంతగానో కృషి చేశారన్నారు. కరెంట్ లేనిది ఏ పని జరగదని, అలాంటి కార్మికులకే అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం రెండు శాతం పీఆర్‌సీ అమలు చేస్తామనడం బాధాకరం అన్నారు. ఈనెల 17న నిర్వహించే సమ్మెకు ఉద్యోగస్తులందరూ సిద్ధంగా ఉండాలన్నారు. ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నా వెనుకాడకుండా సమ్మె కొనసాగించేందుకు కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ రత్నాకర్ రావు, కోకన్వీనర్ శ్రీధర్, నాయకులు గోవర్ధన్ రెడ్డి, రమేశ్‌రెడ్డి, వెంకన్న గౌడ్, భానుప్రకాష్, సంగారెడ్డి శాఖ నుంచి ప్రభాకర్, భూపాల్ రెడ్డి, శ్రీనివాస్, కనకరాజు, సంజీవరావు, రామేశ్వరం స్వామి, కష్ణ శివరామకష్ణ, ఉమ్మడి మెదక్ జిల్లా విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్ కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

తలంబ్రాల బుకింగ్‌కు గడువు పొడిగింపు

సంగారెడ్డి టౌన్: టీఎస్ఆర్టీసీ భక్తులకు కల్పించిన భద్రాద్రి సీతారాముల కల్యాణ తలంబ్రాలను ఈనెల 10వ తేదీ వరకు బుక్ చేసుకునేందుకు గడువు పొడిగించినట్టు మెదక్ రీజియన్ ఏటీఎం లాజిస్టిక్స్ ఎస్.దేవేందర్ రెడ్డి అన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా బుకింగ్ లక్ష దాటిందని, అందులో మెదక్ రీజియన్‌లో తొమ్మిది వేల మంది భక్తులు రాముల వారి తలంబ్రాల కోసం బుక్ చేసుకున్నారన్నారు. అనంతరం మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ శరత్‌కు సీతారాముల తలంబ్రాలను అందించారు.



కలెక్టర్‌కు తలంబ్రాలు అందజేస్తున్న సిబ్బంది

మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా వైద్యాధికారి డాక్టర్ గాయత్రీదేవి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఆరోగ్య మహిళా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ గాయత్రీదేవి అన్నారు. రామచంద్రాపురం పట్టణంలోని ప్రభుత్వ ఆరోగ్యకేంద్రంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళా కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. వైద్యపరీక్షల కోసం వచ్చిన మహిళలతో మాట్లాడారు. సిబ్బంది పనితీరును పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి మంగళవారం నిర్వహించే ఆరోగ్య మహిళ శిబిరాలను మహిళలు వినియోగించుకోవాలన్నారు. మహిళలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. శిబిరంలో అవసరమైన పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ జరిపి పూర్తిస్థాయిలో వారికి వైద్య సేవలను అందించి ఉచితంగా మందులను ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీ నగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి ఉన్నారు.

జోగిపేటలో లంకా దహనం

వేలాదిగా తరలివచ్చిన ప్రజలు



రావణాసురుడి కటౌట్

జోగిపేట(అందోల్): శ్రీ జోగినాథ రథోత్సవాల సందర్భంగా జోగిపేటలోని హైస్కూల్ గ్రౌండ్‌లో లంకా దహనం కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 40 అడుగుల ఎత్తులో రావణాసురుడి ప్రతిమను తయారు చేశారు. ప్రతి సంవత్సరం లంకాదహనం రోజున రావణాసురుడి కటౌట్‌ను తయారు చేసి దహనం చేయడం ఆనవాయితీగా వస్తుంది. సుమారు రూ.5 లక్షలతో ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు. పది తలలతో ఉన్న రావణాసురుడి ప్రతిమ అందరిని ఆకట్టుకుంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. రావణాసురుడి ప్రతిమతో పాటు సర్పాలు, పూల చెట్లను ఏర్పాటు చేశారు. బాణాసంచా కాల్చారు. ప్రతిమను దహనం చేసేందుకు ప్రత్యేకంగా విద్యుత్ సరఫరాతో కూడిన స్విచ్‌లను ఏర్పాటు చేసి పేల్చారు. బాణాసంచా పేలుళ్లతో ఆ ప్రాంతమంతా మారుమోగింది. కార్యక్రమానికి జోగిపేట చుట్టుపక్క ప్రాంతాలకు చెందిన ప్రజలు వేలాదిగా తరలి వచ్చారు. హైదరాబాద్‌కు చెందిన ఆర్కెస్ట్రా కళాకారుల ఆటపాట అందరినీ అలరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే క్రాంతికిరణ్, బీజేపీ నాయకుడు ఉదయ్ బాబూమోహన్‌ను ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో యూట్యూబర్ పుంజు(రాజు) ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రథోత్సవ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులు

నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



గంగాపూర్‌లో పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నారాయణఖేడ్: మన ఊరు – మన బడి కార్యక్రమంతో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. నారాయణఖేడ్ జంట గ్రామం మంగల్‌పేట్‌లోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో రూ.37.40లక్షలతో, గంగాపూర్ ప్రాథమిక పాఠశాలలో రూ.28లక్షలతో మన ఊరు – మన బడి కింద చేపట్టనున్న పనులకు మంగళవారం భూమిపూజ చేశారు. గంగాపూర్‌లో ప్రత్యేక అభివృద్ధి నిధులకు సంబంధించి రూ.15లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, రూ.5లక్షలతో నిర్మించనున్న ఫార్మేషన్‌రోడ్డు పనులను ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్, జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, పీఆర్ డిప్యూటీ ఈఈ ప్రశాంత్, ఏఈ రాకేశ్, ఎంపీటీసీ అశోక్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్వర్, రమేశ్ చౌహాన్, నర్సింహారెడ్డి, నారాయణ పాల్గొన్నారు. ఖేడ్ మండలం అనంతసాగర్‌కు చెందిన సాయిలు అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆస్పత్రి ఖర్చులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.1.25లక్షలు మంజూరు చేస్తూ ఎల్ఓసీ ఉత్వర్వులు జారీ కాగా సాయిలు కుటుంబీకులకు అందజేశారు.

నిలకడగా నీటిమట్టం

- 11.92 మీటర్ల లోతులో నగటు భూగర్భజలాలు
- గత నెలతో పోల్చితే స్వల్పంగా తగ్గుదల
- గతేడాది మార్చి కంటే కాస్త మెరుగు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: జిల్లాలో భూగర్భ జలమట్టం నిలకడగా ఉంది. ఫిబ్రవరితో పోల్చితే మార్చిలో స్వల్పంగా మాత్రమే తగ్గింది. ఎండలు ముదిరినా భూగర్భజల మట్టం పెద్దగా పడిపోలేదు. జిల్లాలో ప్రస్తుతం సగటున 11.92 మీటర్ల లోతులో భూగర్భ జలమట్టం ఉన్నట్లు భూగర్భ జలశాఖ గుర్తించింది. ఈ నీటిమట్టం ఫిబ్రవరిలో 11.04 మీటర్ల లోతులో ఉంది. అంటే మొత్తంగా 0.88 మీటర్ల మేరకు తగ్గినట్లు అధికారులు గుర్తించారు.

- గతేడాది 2022 మార్చి నెలతో పోల్చితే భూగర్భ జలమట్టం స్వల్పంగా పెరిగింది. గతేడాది మార్చిలో 12 మీటర్ల లోతులో ఉండగా ఇప్పుడు 11.92 మీటర్ల మేరకు ఉన్నట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 83 ఫీజో మీటర్లలో భూగర్భ జలమట్టాన్ని ఆ శాఖ ఇటీవల లెక్కించింది.

పడిపోయిన ప్రాంతాలివే..

గతనెల ఫిబ్రవరితో భూగర్భ జలాలు పడిపోయిన ప్రాంతాలను పరిశీలిస్తే.. జిల్లాలో అత్యధికంగా చౌటకూర్ మండలం శివంపేటలో 5.01 మీటర్ల లోతుకు తగ్గిపోయాయి. కల్హేర్ మండలం మీర్‌ఖాన్‌పేట్‌లో 3.51 మీటర్ల లోతుకు వెళ్లిపోయాయి. గుమ్మడిదల మండలం కానుకుంట, హత్నూర మండలం పాన్యల్, సదాశివపేట మండలం నిజాంపూర్, మొగుడంపల్లి, కొండాపూర్, కంగ్టి మండలం చప్ట (కె), కల్హేర్ మండలం బాచుపల్లిల్లో రెండు మీటర్లకు మించి భూగర్భ జలమట్టం పడిపోయినట్లు తేలింది.

ఈ ప్రాంతాల్లో పెరుగుదల..

సాధారణంగా మార్చిలో ఎండలు ముదరడంతో భూగర్భ జలాలు పడిపోతాయి. కానీ జిల్లాలోని కొన్ని మండలాల్లో నీటి మట్టం పెరిగినట్లు భూగర్భ జలశాఖ గుర్తించింది. గుమ్మడిదల, కంది మండలం జుల్కల్, నాగల్‌గిద్ద మండలం ఫసల్‌పాడ్, పుల్కల్, ఇదే మండలంలోని ముద్దాయిపేట్, కోడూర్, సిర్గాపూర్ మండలం వాసర్, జహీరాబాద్ మండలం సత్వార్, మెల్మెచల్మ గ్రామాల్లో భూగర్భ జల మట్టం స్వల్పంగా పెరగడం గమనార్హం.

మండలాల వారీగా భూగర్భ జలమట్టం

మండలం	నీటిమట్టం (మీటర్లలో)	మండలం	నీటిమట్టం	మండలం	నీటిమట్టం	మండలం	నీటిమట్టం	మండలం	నీటిమట్టం
		హత్నూర	18.53	కోహీర్	12.81	నారాయణఖేడ్	10.15	సదాశివపేట	12.37
		ఝరాసంఘం	8.49	కొండాపూర్	15.08	న్యాల్‌కల్	8.17	సంగారెడ్డి	18.78
అమీన్‌పూర్	2.38	జిన్నారం	10.04	మనూర్	5.81	పటాన్‌చెరు	14.56	సిర్గాపూర్	10.84
అందోల్	9.46	కల్హేర్	16.73	మొగుడంపల్లి	10.06	పుల్కల్	5.48	వట్‌పల్లి	5.91
చౌటకూర్	13.39	కంది	12.07	మునిపల్లి	7.47	రాయ్‌కోడ్	5.95	జహీరాబాద్	12.31
గుమ్మడిదల	13.98	కంగ్టి	16.80	నాగల్‌గిద్ద	8.32	రామచంద్రాపురం	14.47	జిల్లా సగటు	11.92

క్లుప్తంగా

బీజేపీ నాయకుడి అరెస్ట్

కొమురవెల్లి(సిద్దిపేట): అక్రమ వసూళ్లకు పాల్పడడనే ఆరోపణల నేపథ్యంలో బీజేపీ నాయకున్ని అరెస్టు చేసి రిమాండ్ తరలించిన సంఘటన కొమురవెల్లిలో చోటు చేసుకుంది. బుధవారం ఎస్ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం..బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి బూరుగు సురేష్ గౌడ్ అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు కాంట్రాక్టర్ రఘు వీరారెడ్డి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. విచారణానంతరం బూరుగు సురేష్ గౌడ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

సిద్దిపేటకమాన్: డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల్లో పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సిద్దిపేట పట్టణంలోని పాతబస్టాండ్, నర్సాపూర్, బీజేఆర్ చౌరస్తాల్లో సిబ్బందితో మూడు రోజుల క్రితం డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించామన్నారు. ఈ తనిఖీల్లో 21 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా విచారణానంతరం జడ్జి వారికి రూ.46వేల జరిమానా విధించారు.

ఆధార్ లింకు చేయాలంటూ సైబర్ మోసం

సిద్దిపేటకమాన్: ఆధార్ వివరాలు క్రెడిట్ కార్డుకు లింకు చేయాలంటూ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ కాల్‌కు స్పందించి డబ్బులు పోగొట్టుకున్న సంఘటన సిద్దిపేట పట్టణంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. సదరు గుర్తు తెలియని వ్యక్తి క్రెడిట్ కార్డుకు ఆధార్ నెంబర్ లింకు చేయాలని నమ్మబలికాడు. లేదంటే క్రెడిట్ కార్డు బ్లాక్ అవుతుందని చెప్పడంతో వెంటనే తన ఫోన్ నెంబర్‌కు వచ్చిన ఓటీపీ వివరాలు చెప్పాడు. దీంతో బాధితుడి క్రెడిట్ కార్డు నుంచి ఆన్‌లైన్‌లో రూ.16వేల వస్తువులు కొనుగోలు చేసినట్లు తన ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. వెంటనే బాధితుడు సైబర్ మోసానికి గురైనట్లు గుర్తించి జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫిర్యాదు చేశాడు.

గుండెపోటుతో వ్యక్తి మృతి


కమ్మరి శివరాజ్ (ఫైల్)

నారాయణఖేడ్: ఆలయంలో మొక్కుతుండగా గుండెపోటుతో మంగళవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. ఖేడ్ పట్టణానికి చెందిన కమ్మరి శివరాజ్ (54) రోజులాగే స్థానిక కాశీ విశ్వనాథస్వామి ఆలయానికి వెళ్లాడు. అక్కడ ఆలయంలోని గర్భగుడిలో మొక్కుతున్న సమయంలో ఒక్కసారిగా గుండెపోటు రావడంతో అక్కడే కుప్పకూలాడు. గమనించిన భక్తులు అతడిని ఆస్పత్రికి తరలించారు. అక్కడ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు.

బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు

కోహెడ(హుస్నాబాద్): బెజ్జంకి మండలం రేగులపల్లి 'సెయింట్ విన్‌సెంట్ పల్లోటి హైస్కూల్' బస్సు డ్రైవర్ కల్లేపల్లి రాజశేఖర్(25)పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. స్కూల్ నుంచి విద్యార్థులను కోహెడకు తీసుకొస్తున్న క్రమంలో సోమవారం కోహెడ నల్లాల బావి వద్ద స్కూల్‌బస్సు పొలంలోకి దూసుకెళ్లిన సంఘటనలో డ్రైవర్ నిర్లక్ష్యం, అజాగ్రత్తతో బస్సును నడపడంతోనే సంఘటన జరిగిందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఇచ్చిన ఫిర్యాదుతో డ్రైవర్, స్కూల్ యాజమాన్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పంట కాపాడుకునేందుకు రైతుల పాట్లు

- సాగులో మొక్కజొన్న, జొన్న
- అడవి పందులు, పక్షుల బెడద
- పంట రక్షించుకునేందుకు ప్రయత్నం
- రంగురంగుల చీరలతో కంచె ఏర్పాటు


బోప్పన్‌పల్లిలో పంట చుట్టూ చీరతో ఏర్పాటు చేసిన కంచె

ఝరాసంగం(జహీరాబాద్): గ్రామాల్లో రైతులు వ్యవసాయం చేసేందుకు తీవ్ర స్థాయిలో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. వాతావరణ పరిస్థితులే కాకుండా పక్షులు, అడవి పందుల నుంచి సైతం ఇబ్బందులు తప్పడం లేదు. సాగు చేసిన పంటలను కాపాడుకునేందుకు నానా తంటాలు పడాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట వేసిన నాటి నుంచి చేతికొచ్చే వరకూ శ్రమించాల్సి వస్తుంది. పంట రక్షణకు పలు రకాలుగా శ్రమించడంతో కొంత మేర సత్ఫలితాలు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. జిల్లాలోని చాలా గ్రామాల్లో ప్రస్తుతం మొక్క జొన్న, జొన్న, పొద్దు తిరుగుడు పంటలు సాగులో ఉన్నాయి. మొక్కజొన్న పంట పలు చోట్ల చేతికి రాగా మరి కొన్ని చోట్ల కంకులు పాల దశలో ఉన్నాయి. జొన్న కంకులు సైతం ఇదే విధంగా ఉన్నాయి.

- అడవి పందులు, కోతులు, పక్షులకు అటవి ప్రాంతంలో సరైన ఆహారం దొరకకపోవడంతో అవి పొలాలపై దాడి చేస్తున్నాయి.
- అడవి పందులు రాత్రి, తెల్లవారు జామున గుంపులుగా సంచరిస్తూ పంటలపై దాడులు చేస్తున్నాయి.
- పంటల రక్షణకు రైతులు అనేక పద్ధతులను అవలంభిస్తున్నారు. మొక్కజొన్న పంట చుట్టూ రైతులు రంగుంగుల చీరలను కంచెగా ఏర్పాటు చేస్తున్నారు. ఇలా చేయడంతో అడవి పందుల బెడద తగ్గిందని కొందరు రైతులు పేర్కొంటున్నారు.
- ఒక్కో రైతు తమ పంట చుట్టూ సుమారు 100 వరకు చీరలను కడుతున్నారన్నారు.
- జొన్న పంటకు కంచె ఏర్పాటుతో పాటు డబ్బాల చప్పుళ్లు, మంచెలను ఏర్పాటు చేసి పక్షుల నుంచి రక్షించుకోగలుగుతున్నారు.
- అంతే కాకుండా సాగులో ఉన్న పంటలపై పక్షుల బెడద నివారణకు మైక్‌లను ఏర్పాటు చేస్తున్నారు. మైక్‌లో తమ వాయిస్ రికార్డుతో పాటు మెమోరి కార్డు ద్వారా రికార్డు చేసిన శబ్దం వినిపిస్తున్నారు. ఆయుర్వేదిక్ మందును బైక్ ఇంజన్ ఆయిల్‌తో(కాలిపోయినది) చీరలను తడిపి పంట చుట్టూ కడుతున్నట్లు రైతులు పేర్కొన్నారు.

చప్పళ్లతో రక్షణ



రెండెకరాల్లో జొన్న పంట వేశాను. జొన్న కంకులను తినేందుకు పక్షులు పంటలపై వాలుతున్నాయి. పంటను రక్షించుకునేందుకు ఉదయం, సాయంత్రం సమయాల్లో వివిధ రకాలుగా చప్పుళ్లు చేస్తూ పంటలను కాపాడుతున్నాం.

– వినోద్ సింగ్, రైతు, ఝరాసంగం

చీరల ద్వారా కంచె ఏర్పాటు



నాకున్న ఒక ఎకరంతో పాటు కౌలుకు రెండున్నర ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాను. అడవి పందుల బెడద నుంచి రక్షణకు పంట చుట్టూ చీరలను కంచెగా మలిచాను. దీంతో పంటకు కొంత మేర నష్టం తగ్గింది.

–సిద్ధప్ప, రైతు, బోప్పన్‌పల్లి, ఝరాసంగం

సఖీ కేంద్రానికి వృద్ధుడి తరలింపు


వృద్ధుడిని వృద్ధాశ్రమానికి అప్పగిస్తున్న అల్లాదుర్గం ఎస్ఐ

అల్లాదుర్గం(మెదక్): గుర్తు తెలియని మతిస్థిమితం లేని వృద్ధున్ని ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి మానవత్వంతో చేరదీసి సఖీ కేంద్రానికి తరలించాడు. ఈ ఘటన మంగళవారం అల్లాదుర్గం పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మతిస్థిమితం లేని వృద్ధుడు మురికి బట్టలతో, పెరిగిన గడ్డంతో చిల్వెర ఐబీ చౌరస్తా వద్ద బ్రిడ్జి కిందనే ఉంటున్నాడు. దొరికిందే తింటూ, పక్కవారిని, ఇరుగుపొరుగు వారిని అడుక్కొని జీవనం వెళ్లదీస్తున్నాడు. దీన్ని గమనించినా అల్లాదుర్గం ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి ఆ వృద్ధుణ్ని చేరదీశాడు. పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి స్నానం, గడ్డం తీయించి కొత్త బట్టలు వేయించారు. అనంతరం ఐసీడీఎస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న వారు వృద్ధున్ని సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువులోని మదర్ థెరిస్సా వృద్ధాశ్రమానికి తరలించారని ఎస్ఐ చెప్పారు. గత కొంత కాలంగా రోడ్డుపై ఉండడం చూసి జాలీ వేసిందన్నారు. దీంతో ఎస్ఐ ఐసీడీఎస్, సఖీ కేంద్రం సూచనలు తీసుకుని వృద్ధాశ్రమానికి తరలించేటట్లు చర్యలు తీసుకున్నానన్నారు. దీన్ని చూసిన ప్రతీ ఒక్కరూ ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి సేవాగుణాన్ని అభినందించారు.

చికిత్స పొందుతున్న వృద్ధురాలి మృతి


విజయశ్రీ మృతదేహం

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ సుభాష్ కథనం ప్రకారం...బీరంగూడ శివాలయం సమీపంలో భిక్షాటన చేసుకుంటున్న వృద్ధురాలు గత నెలలో స్పృహ కోల్పోయి పడిపోయింది. దీంతో స్థానికులు 108 వాహనంలో పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి కోసం ఆరా తీయగా ఆమె పేరు విజయశ్రీ(75)అని గత సంవత్సరం నుంచి బీరంగూడ శివాలయం వద్ద భిక్షాటన చేసుకునేదన్నారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు. మృతురాలి సంబంధికులు ఎవరైనా ఉంటే అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

కడుపునొప్పి భరించలేక వ్యక్తి...


బిక్షపతి (ఫైల్)

సిద్దిపేటరూరల్: కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందిన ఘటన రాఘవాపూర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం...రాఘవాపూర్ గ్రామానికి చెందిన జంగు బిక్షపతి(54) వ్యవసాయం చేస్తూ, కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయన గత కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించినప్పటికీ నొప్పి తగ్గలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది మార్చి 20న పొలం వద్ద పురుగుల మందు తాగాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి వైద్యం నిమిత్తం తరలించారు. అక్కడ మంగళవారం చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పెద్ద కుమారుడు సంజీవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యాశాఖ మంత్రి దిష్టి బొమ్మ దహనం


మంత్రి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

చేర్యాల(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం పరీక్ష పేపర్ల లీకేజీ విషయంలో నిర్లక్ష్యంగా వహిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని ఏఐఎస్బీ జిల్లా అధ్యక్షుడు పుల్లని వేణు అన్నారు. మంగళవారం గాంధీ చౌరస్తా వద్ద విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు విద్యార్థులు, మరోవైపు నిరుద్యోగుల భవిష్యత్‌తో ఆటలాడుతుందని విమర్శించారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ వ్యవహారం కొలిక్కి రాకముందే సోమవారం ప్రారంభమైన పదోతరతగతి పరీక్షలో తాండూర్ పాఠశాలలో తెలుగు ప్రశ్నా పత్రం వాట్సాప్‌లో బయటకురాడవం ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. అదిలాబాద్ జిల్లాలోని ఉట్నూరు పాఠశాలలో జవాబుపత్రాల బండిల్స్ జారిపోవడం విద్యాశాఖ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. సంబంధిత అధికారులు పరీక్షలపై పటిష్ట భద్రత చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ప్రశ్నా పత్రాలు లీక్ అవుతున్నట్లు ఆయన ఆరోపించారు. ఈ విషయంలో విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశాడు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని పటిష్టమైన భద్రతతో పరీక్షలు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు హరికృష్ణ, నాయకులు చందు, రఘు, వంశీ, కిషోర్, సంజయ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



ప్రసాద్ (ఫైల్)

పాపన్నపేట్(మెదక్): కుటుంబ కలహాలతో మద్యం మత్తులో చెరువులో దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన యూసుఫ్‌పేట్ గ్రామ ఊర చెరువు వద్ద మంగళవారం ఉదయం వెలుగు చూసింది. ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం...యూసుఫ్‌పేట్ గ్రామానికి చెందిన బత్తిని ప్రసాద్ (38) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత కొన్ని రోజులుగా మద్యానికి బానిసై ఖాళీగా ఉంటున్నాడు. ఇదే విషయంపై భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేది. సోమవారం రాత్రి ప్రసాద్ బాగా తాగి ఇంటికి వచ్చాడు. మద్యం మత్తులో ఇంట్లో గొడవ పడి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అదేమత్తులో చెరువులో దిగి నీట మునిగి మృతి చెందాడు. పోలీసులకు అందించిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మట్కా ఆడుతున్న వ్యక్తి అరెస్ట్

జహీరాబాద్ టౌన్: మట్కా ఆడుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు చిరాగ్‌పల్లి ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు. మొగుడంపల్లి మండలం మాడ్గికి చెందిన మహేశ్‌గౌడ్ సోమవారం రాత్రి గ్రామ పరిధిలోని కల్లుదుకాణంలో మాట్కా ఆడుతున్నట్లు సమాచారం తెలుసుకొని దాడులు నిర్వహించి మట్కా ఆడుతూ బెట్టింగ్‌కు పాల్పడుతున్న నిందితుణ్ని అరెస్టు చేశామన్నారు. అతని వద్దనుంచి మట్కాకు సంబంధించిన చిట్టీలు, రూ.2,800లు స్వాధీనం చేసుకుని ఎస్ఐ కేసు నమోదు చేశారన్నారు.

కుక్కల దాడిలో మేక పిల్లలు మృతి



శివ్వంపేట(నర్సాపూర్): మేకల పాకపై ఊర కుక్కలు దాడి చేసిన ఘటనలో మేక పిల్లలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన మండల పరిధిలోని గోమారం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గొల్ల మల్లయ్య రోజువారిగానే తన మేకలను పాకలో ఉంచగా మంగళవారం తెల్లవారుజామున కుక్కలు పాకలోని మేకల మందపై దాడి చేశాయి. దీంతో 8 మేక పిల్లలు, 3 గొర్రె పిల్లలు మృతి చెందాయి. వాటిని చూసిన రైతు మల్లయ్య బోరున విలపించాడు.

చేపల వేటకు వెళ్లి పంచాయతీ కార్మికుడు...


శంకర్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

టేక్మాల్(మెదక్): చేపల వేటకు వెళ్లి గ్రామ పంచాయతీ కార్మికుడు మృతి చెందిన సంఘటన టేక్మాల్ మండలంలోని కమ్మరికత్త గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన హరిజన శంకర్(27) పంచాయతీ కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం సాయంత్రం గ్రామ చెరువులోకి చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. మంగళవారం గజ ఈతగాళ్ల సహాయంతో మృతుడు శంకర్‌ను బయటికి తీయించారు. ఆయన భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడు అదృశ్యం


పైల్వాన్ ఖదీర్ పాషా (ఫైల్)

ఝరాసంగం(జహీరాబాద్): ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు అదృశ్యమైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం....మండల పరిధిలోని ఎల్గోయి గ్రామానికి చెందిన పైల్వాన్ ఖదీర్ పాషా(24) పుట్టుకతో కళ్లు కనిపించవు. సోమవారం మధ్యాహ్న సమయంలో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతంలో ఎంత వెతికినా ఫలితం లేకుండా పోయింది. మంగళవారం ఝరాసంగం పోలీస్ స్టేషన్లో తండ్రి పైల్వాన్ యాదుల్ ఫిర్యాదు మేరకు ఎస్.ఐ రాజేందర్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవీందర్ రెడ్డి

సంగారెడ్డి టౌన్: దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసిన సంఘటన సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. డీఎస్పీ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం...విద్యానగర్ కాలనీలో మంగళవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా మోటార్ సైకిల్‌పై అనుమానాస్పదంగా ఒక వ్యక్తి కనిపించాడు. అతణ్ని ప్రశ్నించే లోపే పరారయ్యేందుకు యత్నించగా పోలీసులు చాకచక్యంతో అతణ్ని పట్టుకున్నారు. వెంటనే విచారించగా వికారాబాద్ జిల్లా చెందిన మహేందర్ రావు అని, వృత్తి రీత్యా కార్ డ్రైవింగ్ చేస్తూ జీవనం సాగించేవాడని తెలిపారు. గత నెల క్రితం పోతిరెడ్డి పల్లిలోని తిరుమల ఎన్‌క్లేవ్ కాలనీలో ఓ మహిళ ఇంట్లోకి వెళ్లి రూము అద్దెకు కావాలని మాటల్లోపెట్టి బెదిరించి ఆమె దగ్గర నుంచి బంగారు పుస్తెలతాడు, డబ్బును దొంగిలించాడు. మార్చి 31న సాయి కృష స్కూల్ వద్ద మరో ఇంట్లోకి రహస్యంగా వెళ్లి కత్తితో బెదిరించి ఆమె వద్ద బంగారు గొలుసును అపహరించాడని పోలీసుల విచారణలో దొంగతనం చేసినట్టుగా ఒప్పుకున్నాడు. దీంతో నిందితుని నుంచి మోటార్ బైక్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు పంపించామన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి రూరల్ సీఐ శివలింగం, ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైన్స్‌లలో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

సిద్దిపేటఅర్బన్: తాళం వేసిన వైన్ షాపుల్లో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సిద్దిపేట త్రీటౌన్ సీఐ భానుప్రకాశ్ తెలిపారు. కామారెడ్డి జిల్లాకు చెందిన పిన్నోజి రవి వృత్తి రీత్యా పెయింటింగ్ చేస్తూ ఉండేవాడు. అతను జల్సాలకు అలవాటుపడి పెయింటింగ్‌లో వచ్చే డబ్బులు సరిపోకపోవడంతో దొంగతనాలకు పాల్పడాలనుకున్నాడు. దీంతో అతను తాళం వేసిన వైన్స్‌లను ఎంచుకొని షట్టర్లు పగులగొట్టి మద్యం బాటిళ్లు, నగదు దొంగిలించేవాడు. సిద్దిపేటలోని రంగధాంపల్లి చౌరస్తా వద్ద ఐదు నెలల క్రితం వైన్స్‌లో దొంగతనానికి పాల్పడ్డాడు. జగిత్యాల పట్టణంలో బైక్‌ను దొంగిలించి చేర్యాల, హుస్నాబాద్‌లలో వైన్ షాపుల్లో దొంగతనం చేశాడు. స్నేహితుడు వంశీ సహాయంతో కరీంనగర్ జిల్లా గంగాధరలో వైన్స్‌లో మద్యం బాటిళ్లు దొంగిలించాడు. కొండగట్టులోని రెండు వైన్స్‌లలో మద్యం, నగదు దోచుకున్నాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం రంగధాంపల్లి చౌరస్తా వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో పోలీసులను చూసి పారిపోబోతున్న నిందితుడు రవిని వెంబడించి పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి బైక్, రూ.వెయ్యి స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. నిందితున్ని పట్టుకోవడంలో కీలకపాత్ర వహించిన ఐడీ కానిస్టేబుళ్లు అఫ్జల్, శ్రీనివాస్, స్వామిలను సీఐ అభినందించారు.

చికిత్స పొందుతున్న రైతు మృతి


ప్రభాకర్(ఫైల్)

వర్గల్(గజ్వేల్): అప్పుల బాధ భరించలేక పురుగుల మందు తాగి రైతు మృతి చెందిన సంఘటన వర్గల్ మండలం గిర్మాపూర్ పరిధిలో చోటు చేసుకుంది. గౌరారం ఎస్ఐ సంపత్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గిర్మాపూర్‌కు చెందిన రైతు రాగట్ల పోచయ్యకు ఇద్దరు కొడుకులున్నారు. పెద్ద కొడుకు రాగట్ల ప్రభాకర్(35)కు భార్య లావణ్య, వారికీ ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతను వ్యవసాయంతోపాటు టైల్స్ మేస్త్రీగా పని చేస్తుంటాడు. తనకున్న వ్యవసాయ భూమిలో రెండు, మూడు బోర్లు వేసినప్పటికీ నీళ్లు పడలేదు. పంటల సాగుకు దాదాపు రూ.7.5లక్షల వరకూ అప్పు తెచ్చాడు. అప్పు విషయమై ప్రభాకర్ తరచూ ఆలోచిస్తూ బాధపడుతుండేవాడన్నారు. ఈ క్రమంలోనే గత నెల 26న పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీన్ని గమనించిన కుటుంబీకులు అతన్ని వైద్యం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం రాత్రి మృతిచెందాడు. మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

కలెక్టరేట్‌లో కుక్కల సంచారం



సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలో వీధి కుక్కలు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. ఇటీవల అదనపు కలెక్టర్‌ను కుక్కలు కరిచినా... సంబంధిత అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదు. భవనంలోని అన్ని అంతస్తుల్లో కుక్కలు తిరుగుతుండడం అధికారులు, సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేస్తోంది.

సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి

గజ్వేల్ ఏసీపీ రమేశ్



మాట్లాడుతున్న ఏసీపీ రమేశ్

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని గజ్వేల్ ఏసీపీ రమేశ్ పేర్కొన్నారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ మోడల్ రెసిడెన్షియల్(జీఎంఆర్) పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యం దిశగా కృషి చేయాలన్నారు. విద్యార్థులు ప్రభుత్వాలు అందించే సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ ఇతరులకు ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సైతం ఉత్సాహంగా పాల్గొన్నారు. జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దాడి కేసులో రిమాండ్

పటాన్‌చెరు టౌన్: దాడికి పాల్పడిన కేసులో పోలీసులు ఆరుగురిని రిమాండ్‌కు తరలించిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..మండల పరిధిలోని ఇస్నాపూర్‌లో యాసిన్ పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే పండ్లు విక్రయించే సమయంలో మహేందర్‌తో యాసిన్‌కు గొడవ జరిగింది. మహేందర్ మరో 9 మందితో కలిసి తనపై దాడి చేసి నోట్లో మద్యం పోసారని యాసిన్ ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి మహేందర్‌తో పాటు మరో ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం డిమాండ్


కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కేవీపీఎస్, డీబీఎఫ్ నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): దొంగతనం చేశాడనే నెపంతో దళితుడైన మల్లేశంను చిత్ర హింసలకు గురి చేసి కరెంట్ షాకు పెట్టి హత్య చేసిన 30 మంది నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం డిమాండ్ చేశారు. మంగళవారం బాధితురాలు మీనాతో వారు కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధితురాలకి ఎస్సీ, ఎస్టీ, పీఓఏ చట్టం–1989 ప్రకారం తక్షణ సాయం, నష్ట పరిహారం, పునరావాసం కల్పించాలన్నారు. వైరు దొంగతనం చేశాడని దళితుడిని రాత్రంతా చిత్ర హింసలకు గురిచేసి కరెంట్ షాక్ పెట్టి చంపడం అమానుషమన్నారు. మృతుడు మల్లేష్‌ను మార్చి 25న అర్ధరాత్రి పొలం దగ్గర కొంతమంది రైతులు పట్టుకొని చిత్రహింసలకు గురి చేస్తూ మూకుమ్మడిగా కరెంట్ షాక్ పెట్టి కాల్చి చంపారన్నారు. ఈ విషయంలో పోలీసులు హత్య, అట్రాసిటీ కేసులు నమోదుచేసి అదుపులోకి తీసుకున్నారు. కొంత మంది నిందితులను తప్పించే కుట్రలు కొందరు చేస్తున్నారని వారు ఆరోపించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ. 8,25,000లు నష్టపరిహారంగా అందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట నాయకులు లక్ష్మి, కల్పన, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అశోక్, సహాయ కార్యదర్శి ప్రవీణ్, బేడ, బుడగ జంగం అధ్యక్షుడు ఎం. అంజయ్య, ప్రభాకర్, అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడు నీరుడు రమేశ్ పాల్గొన్నారు.